నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 15 మే 2025 | KAMAREDDY

# ఎండలోనే ఉపాధి పనులు

- పనిచేసే చోట సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో మండుటెండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



కామారెడ్డి, మే 14 : ఉమ్మడి జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ కూలీలు పనులు చేయడం కష్టసాధ్యంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పించి, పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. వేసవి కాలంలో టెంటు, తాగునీటిని అందుబాటులో ఉంచి, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా చర్యలు తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువయ్యాయి. అన్నిసౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలుచేసేవారే కరువయ్యారు. ఎండలో పనిచేసేవారు సేదదీరడానికి కనీసం టెంట్, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎండ తీవ్రతకు ఇప్పటికే పలువురు కూలీలు వడదెబ్బ బారిన పడి మృతిచెందగా..మరి కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఉపాధి పనులు జరిగే చోట మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచకపోవడంతో దవాఖాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. దీంతో కొన్ని సమయాల్లో దవాఖానకు వెళ్లేలోపు కొందరు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ఉపాధి కూలీలకు కనీసం నీడ, తాగునీటి సౌకర్యం కల్పించడంలేదు. దీంతో కూలీలు మండు టెండలోనే పని చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేలమందికి పైగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. మే నెలలో ఎండ తీవ్రంగా ఉండడంతో పని చేసే చోట కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

### మెడికల్ కిట్లు కరువు

ఉపాధి హామీ కూలీలకు పని చేసే చోట సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవు. సేద దీరడానికి నీడ, తాగునీటి సౌకర్యం కల్పించడంలేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏమైనా గాయాలైనప్పుడు, వడ దెబ్బ తగిలితే మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచడంలేదు. తాగునీరు కావాలన్నా ఎవరికి వారే ఇంటి నుంచే తెచ్చుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీల్లో బడ్జెట్ లేకపోవడంతో వసతులు కల్పించడం లేదని అధికారులు చెబుతున్నారు. తమకు కనీసం పనిచేసే చోట టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

### పంచాయతీవారే సమకూర్చాలి

2016లో టెంట్లు వేసుకోవడానికి తాటిపత్రిలు ఇచ్చారు. వాటినే ఇప్పటివరకు వాడుకుంటున్నారు. అవి పాడైపోయాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వలేదు. తాగునీటి సౌకర్యం పంచాయతీ సిబ్బంది కల్పించాలి. కానీ వారు పట్టించుకోవడంలేదు. మెడికల్ కిట్లు కూడా పంచాయతీ వారే అందుబాటులో ఉంచాలి.

**- రాజు, ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్**

---

అధికార పార్టీ వేధింపుల పర్వం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న జీవన్‌రెడ్డిని టార్గెట్ చేసింది. ఎలాంటి తప్పులు చేయకపోయినా జీవన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులపై వేధింపుల పర్వానికి తెర తీసింది. ఏ తప్పులు జరగకపోయినా ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు అధికారులు సీజ్ చేశారు. దీనిపై జీవన్‌రెడ్డి చేసిన న్యాయపోరాటం ఫలించి మాల్ తెరుచుకున్నది. అసలు వివాదమే లేని శంకర్‌పల్లి భూములకు సంబంధించి కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో ఎవరో ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు మేరకు చేవెళ్ల, మోకిల పోలీసు స్టేషన్లలో జీవన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి రజితారెడ్డి, 70 ఏండ్ల వృద్ధురాలైన జీవన్‌రెడ్డి తల్లిపై అక్రమ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో జీవన్‌రెడ్డి సతీమణి, తల్లికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా అత్యున్నత న్యాయస్థానం తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై జీవన్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.

సుప్రీం కోర్టులో జీవన్‌రెడ్డికి భారీ ఊరట



# అక్రమకేసులపై న్యాయపోరాటం చేస్తా..

- వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే వేధింపులు
- రాజకీయ కక్ష సాధింపు చర్యలకు భయపడేదిలేదు..
- న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉంది..
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి స్పష్టీకరణ

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్/ నందిపేట, మే 14 : బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికు సుప్రీంకోర్టు భారీ ఊరట లభించింది. శంకర్‌పల్లి భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, మోకిల పోలీస్‌స్టేషన్లలో నమోదైన అక్రమ కేసుల్లో ఆయనకు బిగ్ రిలీఫ్ లభించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే దర్యాప్తునకు సహకరించాలని కోర్టు జీవన్‌రెడ్డిని ఆదేశించింది. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా నమోదైన అక్రమ కేసు అని జీవన్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ముకుల్ రోహిత్, ఎస్.నిరంజన్‌రెడ్డి, మహఫూజ్ నజకీల వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది.

### కక్ష సాధింపు చర్యలకు భయపడేదిలేదు..

రాజకీయ కక్షసాధింపు చర్యలకు భయపడేది లేదని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యమ కాలంలో అప్పటి సీమాంధ్ర కాంగ్రెస్ ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులు తిరగతోడుతుండడమే కాకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తొలిరోజు నుంచే బూటకపు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు తనపై 40 కేసుల వరకు అక్రమంగా నమోదు చేసి వేధిస్తున్నారని పేర్కొన్నారు. 70 ఏండ్ల వృద్ధురాలైన తన తల్లి ఏం తప్పు చేశారని ఆమెను మానసికంగా హింసిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, బెదిరింపులకు లొంగేది లేదని స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై తనకు అచంచలమైన విశ్వాసముందని పేర్కొన్నారు. తనను దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిస్తున్న అక్రమ కేసులపై న్యాయపోరాటం కొనసాగిస్తానని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

---

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మే 14 : జిల్లాలో నిధులు మంజూరైన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అవసరం లేని పనులు ఉంటే సరైన కారణాలతో రద్దుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళను కోటీశ్వరాలుగా చేయాలన్న ఉద్దేశంతో 11,668 సంఘాలకు రూ. 802 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించినందుకు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిని జ్ఞాపికతో అభినందించారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---



రూ. 5 వేలు పోగొట్టుకోవడంతో మనస్తాపం

# ఆన్‌లైన్ గేమ్‌కు యువకుడు బలి



మాగిరి గంగాధర్ (ఫైల్)

రుద్రూర్, మే 14: ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. రాయకూర్ గ్రామానికి చెందిన మాగిరి గంగాధర్ (20) మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడడానికి అలవాటు పడ్డాడు. తన తండ్రి ఫోన్ నుంచి రూ.ఐదు వేలు తన ఫోన్‌లోకి పంపుకొని గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. డబ్బులు పోయాయన్న మనస్తాపంతో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

---

ధాన్యం కొనాలని

# రోడ్డెక్కిన రైతులు

- ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో
- పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, మే 14 : ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు రోడ్డెక్కారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న రైతులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించి, రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజులుగా రోడ్లపైనే ధాన్యం వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్డీవో రాజాగౌడ్ చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రాజాగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి, ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ ఖేత్ నాయకుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఆలూర్ ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకోలో పాల్గొన్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

---

# విషాదం!

- జాతీయ రహదారిపై డీసీఎం, బైక్ ఢీ
- అక్కడికక్కడే అన్నదమ్ముల దుర్మరణం



అర్జున్ (ఫైల్)



నాగేంద్ర (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, మే 14: ఆర్మూర్ మండలంలోని చేపూర్ శివారులో ఉన్న 63వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. డీసీఎం వ్యాన్, బైక్‌ను ఢీ కొట్టడంతో ఆర్మూర్‌పట్టణానికి చెందిన అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకున్నది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణం జెమ్మన్‌జెట్టికి చెందిన కొండూర్ అర్జున్(21), కొండూర్ నాగేంద్ర (19) అన్నదమ్ములు. ఇద్దరూ హైదరాబాద్‌లో ఉంటూ అర్జున్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుండగా, నాగేంద్ర హోటల్ మెనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. నెలరోజుల క్రితం ఇద్దరు ఇంటికి వచ్చిన వారు మంగళవారం మెట్‌పల్లిలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం తిరిగి వస్తుండగా ఆర్మూర్ మండలంలోని చేపూర్ శివారులో ఉన్న 63వ జాతీయ రహదారిపై డీసీఎం వ్యాన్, వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

---

### సిరికొండలో అకాలవర్షం



తాటిపల్లిలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం

సిరికొండ, మే 14 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి అకాల వర్షం కురిసింది. తాటిపల్లి గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు నివాస గుడిసెల పైకప్పులు ఎగిరిపోయాయి. గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. గ్రామంలోని పొన్నం దేవయ్య, బానావత్ రవి ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి.

---

బిచ్కుంద ఠాణాలో

# ఏసీబీ సోదాల కలకలం!

- పది గంటలపాటు కొనసాగిన తనిఖీలు
- ఇసుక అక్రమ రవాణాపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు
- అవినీతికి పాల్పడినట్లు గుర్తించామని ఏసీబీ డీఎస్పీ వెల్లడి



బిచ్కుంద, మే14: బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏసీబీ అధికారుల సోదాలు కలకలం సృష్టించింది. సుమారు పది గంటల పాటు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. మంజీర పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను వదిలేస్తున్నారనే ఆరోపణలు నేపథ్యంలో సోదాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ స్థానిక విలేకరులకు తెలిపారు. తనిఖీల్లో పోలీస్‌స్టేషన్ ఆవరణలో పది ఇసుక ట్రాక్టర్లను గుర్తించినట్లు చెప్పారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను వదిలివేయడానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు, రెగ్యులర్‌గా ఇసుక తరలిస్తున్న వారి నుంచి వసూళ్లతోపాటు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించినట్లు వివరించారు. సోదాల్లో పలు ఆధారాలు లభించినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

### ఇది ట్రాప్ కేసు కాదు.. ఆకస్మిక తనిఖీలు మాత్రమే

ఇది ట్రాప్ కేసుకాదని ఆకస్మిక తనిఖీలు మాత్రమేనని డీఎస్పీ తెలిపారు. మంజీరా నది నుంచి చాలా రోజులుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. కొందరు ఫిర్యాదు చేయడానికి వచ్చి భయపడి వెనక్కి వెళ్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడైనా అవినీతి జరిగితే టోల్‌ఫ్రీ 1064 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.